




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

శనివారం | 18 | అక్టోబర్ | 2025 పేజీలు : 8


# రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది బిజెపినే..

-బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు
-సింగరేణి కార్మికులకు బోనస్
-మీడియా సమావేశంలో మల్లు భట్టివిక్రమార్క



ప్రజాపక్షం/ ఖమ్మం : తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది ముమ్మాటికి బిజెపినేనని రాష్ట ఉప ముఖ్య మంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు

మిగతా 2లో..

# నిస్వార్థ కమ్యూనిస్టు యోధుడు కర్నాటి కృష్ణయ్య

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి
కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఖమ్మం తొలి శాసన సభ్యులు, నిస్వార్థ కమ్యూనిస్ట్ యోధుడు, ప్రజా పోరాట నాయకుడు, కొందరు చనిపోయిన ప్రజల మనసుల్లో ఉంటారు అలాంటి మహానుభావులలోకామ్రేడ్ కర్నాటి కృష్ణయ్య ముందు వరుసలో ఉంటారు

మిగతా 2లో..










# ఖమ్మంను క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచాలి



**-ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు**
**-ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీరు**
**-వసతి గృహ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నగరంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని ముస్తఫానగర్‌లో రూ. 3కోట్లతో నిర్మించనున్న బిసి బాలుర వసతి గృహ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ బిసి వసతి గృహ నూతన భవనం కోసం మూడు కోట్లు మంజూరు చేశామన్నారు. ఖమ్మం నగరంలో కూలిపోయే స్థితిలో ఉన్న మూడు సంక్షేమ హాస్టల్స్ నిర్మాణానికి ప్రభుత్వం తొమ్మిది కోట్లు మంజూరు చేసిందన్నారు. వసతి గృహ నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి భవిష్యత్తులో పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ప్రజలు అంగీకరిస్తే బోనకల్ రోడ్డు వెడల్పు చేస్తామన్నారు. రోడ్డు విస్తరణతో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఖమ్మం నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, చెత్తను డ్రైనేజీల్లో, రోడ్లపై వేయవద్దని సూచించారు. ఇంటి పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే రోగాల భారీనపడే అవకాశం ఉందని దీనితో అనవసరంగా ఆసుపత్రులకు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. ఖమ్మం నగరంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి శుద్ధి చేసిన త్రాగు నీటిని అందించనున్నట్లు తెలిపారు. ఇందు కోసం రూ. 220 కోట్లు మంజూరు చేస్తామన్నారు. మనం కష్టపడి సంపాదించిన డబ్బు పిల్లల భవిష్యత్తు కోసం ఖర్చు పెట్టాలని అనవసరంగా ఆసుపత్రుల పాలు చేయవద్దన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు, స్వామినారాయణ్ స్కూల్ కూడా త్వరలో ఖమ్మంలో రాబోతుందన్నారు. పేద విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా ముఖ్యమంత్రి గురుకులాల డైట్ ఛార్జీలను, కాస్మోటిక్ ఛార్జీలను పెంచడం జరిగిందన్నారు. నగరంలో రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలన్నారు. పావల నష్టపోతే ప్రజలకు రూపాయి వరకు పరిహారం అందిస్తూ ఆదుకుంటున్నామన్నారు. రైల్వే స్టేషన్ రోడ్డు వెడల్పు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డివిజన్లలో విస్తరించాల్సిన రోడ్ల వివరాలను కార్పొరేటర్లు అందించాలన్నారు. భగవంతుని దయ ప్రజల ఆశీర్వాదంతో ఖమ్మం జిల్లాలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో తనకు భాగస్వామ్యం వహించే అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, ఖమ్మం మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్ రోజ్‌లీనా, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, ఈఈలు రంజిత్, కృష్ణలాల్, సహాయ కమిషనర్ అనిల్‌కుమార్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# నిస్వార్థ కమ్యూనిస్టు యోధుడు కర్నాటి కృష్ణయ్య

(మొదటిపేజీ తరువాయి)



అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం లోని సిపిఐ కార్యాలయం వద్ద కర్నాటి కృష్ణయ్య 27వ వర్ధంతి సభ ను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత కర్నాటి కృష్ణయ్య స్థూపం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించి, పార్టీ అరుణ పతాకాన్ని రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. ఖమ్మం తొలి శాసన సభ్యులు గా పోటీ చేసినా కృష్ణయ్య పై ఆరుగురికి డిపాజిట్లు కూడా దక్కలేదు అని గుర్తు చేశారు. తెలంగాణ రైతాంగ ఉద్యమం లో కీలక పాత్ర పోషించారని అన్నారు. నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా కోర్టులు నిర్వహించి ప్రజాల పక్షాన పోరాడిన యోధుడని తెలిపారు. నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యాన్ని కలిగిస్తున్నారని అప్పటి నిజాం ప్రభుత్వం కర్నాటి కృష్ణయ్య ను పట్టిస్తే 10000 బహుమతి ఇస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయన కుటుంబం కూడా ఆయన ఆశయా సాధనలోనే ముందుకు సాగుతుండటం అభినందనీయమని తెలిపారు. మహోన్నతుల మరణాలను జ్ఞాపకం చేసుకొని వారి ఆశయ సాధనాల కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు , సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు, మచ్చా రఘుపతిరావు, మచ్చా రేణుక, కర్నాటి రవీందర్, కర్నాటి నళిని రాణి, బీఆర్ఎస్ మండలం అధ్యక్షుడు వున్నాం బ్రహ్మయ్య, నాగు బండి శ్రీనివాసరావు, కోటి సైదిరెడ్డి, మరికంటి రేణుబాబు, సిపిఎం మండల కార్యదర్శి కె.వి. రెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, రచ్చ నరసింహారావు, యడ్ల తిరుపతిరావు, పగిడికత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది బిజెపినే..

(మొదటిపేజీ తరువాయి)

42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి ఇప్పటికీ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. దేశంలో ఎక్కడలేనివిధంగా ఆర్థిక సామాజిక విద్య రాజకీయ సర్వే నిర్వహించామని సర్వే వివరాల ప్రకారం బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టామని ఆయన తెలిపారు. గతంలో బిఆర్ఎస్ తీసుకు వచ్చిన చట్టాన్ని సవరించామని తెలిపిన భట్టి బిసిలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగాల కల్పనకు సంబంధించి గవర్నర్‌కు బిల్లు పంపిన ఇంత వరకు ఆమోదించ లేదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొన్ని నెలలుగా బిసి చట్టం అమల్లోకి రాకుండా అడ్డుకుంటుందని ఆయన తెలిపారు. బిజెపి నైజాన్ని తెలంగాణ ప్రజలతో పాటు యావత్ దేశ ప్రజలు గుర్తిస్తున్నారని అఖిలపక్షం కలిసేందుకు కూడా ప్రధాన మంత్రి అంగీకరించడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షంతో కలిసేందుకు ప్రధాన మంత్రికి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసినా స్పందించకపోవడం శోచనీయమన్నారు. జంతర్ మంతర్ వద్ద ధర్నా చేసి ఆహ్వానించినా బిజెపికి పాల్గొనలేదని ఆయన తెలిపారు. రాష్ట్రానికి చెందిన బిజెపి నాయకులు కేంద్ర ప్రభుత్వం వద్ద బిసి బిల్లు ఆమోదం పొందేవిధంగా కోరాలని ఆయన సూచించారు. సుప్రీం కోర్టు తీర్పు కాపీ రాగానే రిజర్వేషన్ల అంశంపై చర్చిస్తామని ఈనెల 23న జరిగే క్యాబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు రూ. 400 కోట్ల బోనస్ ప్రకటించిందని ఆయన తెలిపారు. దేశంలో వెలుగులు పంచుతున్న సింగరేణి కార్మికులకు బోనస్ అందించడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ దీపావళి తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. మీడియా సమావేశంలో మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్ఎ కొండబాల కోటేశ్వరరావు, నగర అధ్యక్షులు జావిద్, కొత్తా సీతారాములు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఎల్‌వోసి చెక్కును అందించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థినికి వైద్య చికిత్సల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌వోసి చెక్కును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అందజేశారు. శుక్రవారం వీడియోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని శ్లోకకు లక్ష రూపాయల ఎల్‌వోసి చెక్కును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అందజేశారు. ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని పి.శ్లోక ఐదేండ్లుగా ఎముకలకు వచ్చిన ట్యూమర్ కారణంగా ఇబ్బందులు పడుతుంది. ఇప్పటికే ఎడమ చేయి తొలగించగా వెన్నెముక సర్జరీ కూడా జరిగింది. ప్రస్తుతం ఊపిరితిత్తుల్లో కూడా ట్యూమర్ ఏర్పడింది. తండ్రి కూడా లేని శ్లోకకు ఆర్థిక సాయం చేయాలంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శ్లోక కుటుంబ సభ్యులు కోరారు. స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లక్ష రూపాయల ఎల్‌వోసి చెక్కును మంజూరు చేయించారు. కృత్రిమ చేయి ఏర్పాటుతో పాటు శ్లోక పై చదువుల విషయంలో కూడా సాయం అందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. ప్రస్తుతం శ్లోక ఖమ్మంలోని సాహితి కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతుంది. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు పాల్గొన్నారు.







# భారీ బహిరంగ సభకు సిపిఐ శ్రేణులను సిద్ధం చేయండి




**-60 రోజుల పాటు వాడవాడలా శతాబ్ది ఉత్సవ ప్రచారం**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో డిసెంబర్ 26న జరిగే భారీ బహిరంగ సభకు సంబంధించి పార్టీ క్యాడర్‌ను సిద్ధం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కోరారు. ఖమ్మం నగరంలోని ప్రతి ఇంటికి శతాబ్ది ఉత్సవాల సందేశాన్ని అందించాలన్నారు. సిపిఐ నగర సమితి సమావేశం శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా అధ్యక్షతన జరిగింది. సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ ప్రస్థానంలో అనేక పోరాట విజయాలు ఉన్నాయని వాటన్నింటిని నేటి తరానికి తెలియజేయాల్సి ఉందన్నారు. ఖమ్మం జిల్లాలో మహోత్తర పోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ వేదికగా నిలిచిందని నాటి సాయుధ తెలంగాణ రైతాంగ పోరాటం నుంచి నిన్న మొన్నటి తెలంగాణ ఉద్యమం ఆ తర్వాత ప్రజా సమస్యల పరిష్కారం వరకు కమ్యూనిసు పార్టీ ప్రజల పక్షాన నిలిచిందన్నారు. ఖమ్మం జిల్లాలో గ్రామ గ్రామాన సిపిఐ పోరాట గుర్తులు ఉన్నాయని యావత్ చరిత్రను నేటి తరానికి తెలియజేసే లక్ష్యంతో శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకత్వంతో పాటు 40 దేశాల నుంచి విదేశీ కమ్యూనిస్టు ప్రతినిధులు హాజరయ్యే ఈ సభ ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని సురేష్ కోరారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, జిల్లా సమితి సభ్యులు నూనె శశిధర్, తాటి నిర్మల, వరదా నర్సింహారావు, బోడా వీరన్న, సైదా, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే పంటలను అమ్ముకోవాలి



**కిసాన్ కపాస్‌పై సమీక్ష**

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులో రైతు వేదికలో కిసాన్ కపాస్ పై శుక్ర వారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య వ్యవసాయ శాఖ అధికారిని విస్తరణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి రైతు కిసాన్ కపాస్ యాప్ ద్వారా తమ ఆధార్ కార్డుతో ఆన్లైన్ చేసుకొని తమ పత్తిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ద్వారా అమ్ముకోవచ్చు అని అన్నారు. కాలయాపన ద్వారా నేరుగా తమ పత్తిని అమ్ముకోవచ్చని పేర్కొన్నారు. దళారులు పాలు కాకుండా నేరుగా ప్రభుత్వానికి అమ్ముకోవచ్చని వివరించారు. పంటల నమోదు, కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కొనుగోలు సమయంలో జాగ్రత్తలు, పలు సలహాలు, సూచనలు రైతులకు తెలియపరచాలని పత్తి వరి ధాన్యం రైతులు దళారులు పాలు కాకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధరను పొందేందుకు రైతులకు గ్రామాల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని ఏఈఓ లను వారు కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నేరుగా గ్రామస్థాయిలో తెలియపరచాలని వారు నష్టపోకుండా వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారిని రూప, ఏఈవోలు దీపిక ,వెంకట లీల, వెంకట్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# నూతన పోలీస్‌స్టేషన్ భవనాలు మంజూరు

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలం ఎంతో విశాలమైన సుదీర్ఘ దూర ప్రాంతాలు 40 గ్రామపంచాయతీలు కలిగి ఉన్నందున పరిపాలన సౌలభ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం నూతన పోలీస్‌స్టేషన్ భవనాలు మంజూరు చేసినట్లు సమాచారం. తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ఉన్న పోలీస్‌స్టేషన్ శిథిలావస్థకు చేరగా నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించగా నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిసింది. కాని ప్రసుతతం ఉన్న తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్ స్థలం నూతన భవన నిర్మాణానికి సరిపడా లేకపోవడంతో తిరుమలాయపాలెం హాస్పటల్ ఏరియాలో పోలీస్ స్టేషన్ మార్చేందుకు స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. మండలంలోని సుబ్లేడు గ్రామాన్ని ఇప్పటికే నూతన మండలంగా ప్రకటించాలని స్థానిక పాలేరు శాసనసభ్యులు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి పలుమార్లు విన్నవించగా సుబ్లేడు గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించేందుకు ప్రభుత్వం ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. సుబ్లేడు గ్రామం ఎంతో ప్రాచీన చరిత్ర కలిగి ఎక్కువ ప్రభుత్వ స్థలాలు ఇప్పటికే ప్రభుత్వ భవనాలు ఉండగా కొత్తగా సుమారు వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇంటిగ్రేడ్ హాస్టల్, రహదారులు అంతర్గత సిసి రోడ్లకు ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. స్థానిక ఎన్నికల అనంతరం సుబ్లేడు గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.

## మహా అన్నదానం



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు లోని పెద్ద చెరువు కట్టపై ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి గుడి వద్ద అన్నదానం కార్యక్రమం శుక్ర వారం లక్కినేని నరసింహారావు, వలసల మోహన్ రావు, నరేందర్, కృష్ణయ్య ల ఆధ్వ ర్యంలో జరిగింది. అన్ని దానాల కన్నా అన్న దానం మిన్న అన్నదాత సుఖీభవ అంటూ దాతలను అభినందించారు. ఈ కార్యక్ర మాన్ని తహశీల్దార్ పులి సాంబశివుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజాదేవి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు చందర్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు లక్ష్మీ పురం, కప్పల బంధం, బత్తుల పల్లి, పుల్లయ్య బంజర, కృష్ణయ్య బంజర, పరిసర గ్రామాల భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి.

## కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం



**ప్రజాపక్షం/వైరాః** సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ బిసిలకు 42% రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చిన నేపద్యంలో వైరా రింగు రోడ్డు సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మనుద గ్దం చేశారు. అనంతరం పార్టీ పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం , జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట ప్రభుత్వం రాష్టలో కులగణన చేసి 57%గా ఉన్న బిసిలకు 42% రిజర్వేషన్లు ఉండాలని తెలంగాణ అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి గవర్నర్ ఆమోదంకు జీవో నెంబర్ 9ని పంపించి మూడు నెలల కాలం అవుతున్న కాలయాపన చేస్తున్నారు. దీనివలన స్థానిక సంస్థల ఎన్నికలు ఆగి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఆటంకంగా ఉందన్నారు. ఇప్పటికైనా జీవో నెంబర్9ని ఆమోదించి స్థానిక సంస్థలకు, గ్రామపంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను మంజూరు చేసి గ్రామపంచాయతీలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యురాలు మచ్చా మణి, డివిజన్ కమిటీ సభ్యులు తూము సుధాకర్, తోట నాగేశ్వరరావు, వైరా రూరల్ మండల నాయకులు బాజోజి రమణ, పట్టణ నాయకులు కొంగర సుధాకర్, పైడిపల్లి సాంబశివరావు, పారుపల్లి కృష్ణారావు, మల్లెంపాటి రామారావు, కామినేని రవి, చింతనిప్పు నర్సింహారావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

## పొన్నెకల్లులో ఉచిత మెగా మెడికల్‌క్యాంప్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని పొన్నెకల్లుగ్రామంలో పాలపాటి యేసు సంస్మరణార్థం కుమారుడు డాక్టర్ పాలపాటి క్రాంతికుమార్ పీరు నాయక్‌చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఉచిత మెగా మెడికల్‌క్యాంప్‌ను శుక్రవారం ఏర్పాటు చేశాడు. వివిధ అనారోగ్య సమస్యలతో హాజరైన 100మందికి ట్రీట్‌మెంట్ చేసి మందులను ఉచితంగా అందజేశారు. అలాగే కంటి పరీక్షలను సైతం చేసి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ నిర్వాహకుడు వడిత్యా రవికుమార్, డాక్టర్లు శేఖర్, కీర్తి, గ్రామ పెద్దలు వరగాని మోహన్‌రావు, గుర్రం మల్‌సూర్, గ్రామ కార్యదర్శి తిలక్, యువతి, యువకులు పాల్గొన్నారు.

## ప్రియదర్శినిలో కెరీర్ గైడెన్స్ సదస్సు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని పెద్దతండలో గల ప్రియదర్శిని మహిళా సాంకేతిక కళాశాలలో కెరీర్ గైడెన్స్ సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిపుణులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మెషిన్‌లెర్నింగ్ రంగాల్లో భవిష్యత్ అవకాశాలపై విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు మాట్లాడారు...ఇప్పటి ప్రపంచం వేగంగా డిజిటల్ మార్పుల దిశగా పయనిస్తోందన్నారు. సాంకేతికల ద్వారా భవిష్యత్తు పరిశ్రమల నైపుణ్యం సాధించడంలో దోహదపడుతుందన్నారు. అంతేకాకుండా అంతర్జాతీయ స్థాయిలో మంచి ఉద్యోగ అవకాశాలను పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌డేటా ఇంజనీర్లు సతీష్, బ్లూమెట్రా, ప్రిన్సిల్ డాక్టర్ బత్తు గోపాల్, అకడిమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకట రమణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కిసాన్‌యాప్‌పై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని గుదిమళ్ల, ముత్తగూడెం, కాచిరాజుగూడెం, పొన్నెకల్లు, గోల్లపాడుకు చెందిన రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కిసాన్‌యాప్‌పై శుక్రవారం అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా ఏఈఓలు రైతుల ఫోన్‌లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేపించారు. సిసిఐకి పత్తి అమ్మలంటే యాప్ ద్వారానే స్లాట్‌బుక్ అవుతుందని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఉమానాగేష్, వ్యవసాయ విస్తరణధికారులు వంశీ, ఆదర్శ్, హిమబిందు, కావ్య తదితరులు పాల్గొన్నారు.

## నేటి బిసి బంద్‌కు కాంగ్రెస్ మద్దతు



**ప్రజాపక్షం/ మధిర :** స్థానిక ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ బిసి సంఘాల చేపట్టనున్న బంద్‌కు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ తరుపున డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మద్దతు తెలిపారని మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ తెలిపారు. నేడు నిర్వహించిన బిసిల బంద్‌కు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని, ఈ బంద్ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలోపాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయనతో పాటు పట్టణ అధ్యక్షులు మిరియాల వెంకటరమణగుప్తా పార్టీ శ్రేణులకు బంద్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, చిలువేరు బుచ్చిరామయ్య, నిడమనూరి వంశీకృష్ణ, పత్తేపరపు సంగయ్య, షేక్.జహంగీర్, జింకల కోటేశ్వరరావు, ఆళ్ళ కృష్ణ, దూదేకుల జాని తదితరులు పాల్గొన్నారు.

## సిపిఆర్‌పై అవగాహన




**ప్రజాపక్షం/ మధిర :** మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు శుక్రవారం టెలి మానస్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ రాములు నాయ క్, డాక్టర్ పృధ్వీరాజ్‌లు విద్యార్థులకు హృదయశ్వాస కోస పునర్జీవ జీవన చర్య (సిపిఆర్)పై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో మన చుట్టూ పక్కల ఎవరికైనా హర్ట్ ఎటాక్ వచ్చి ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉంటే వారికి వెంటనే సిపిఆర్ ద్వారా మనిషి ప్రాణాలను రక్షించవచ్చునని తెలిపారు. టెలి మానస్ హెల్ప్‌లైన్ నెంబర్ 14416 ద్వారా మరెన్నో విషయాలు తెలుసువచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.జైదాస్, ఎన్‌ఎస్‌ఎస్ పిఓ బి.తౌరియా, ఆర్.లత, ఎస్కే షహీన్‌బేగం, యు.కృష్ణ,జి.కృష్ణ, సాంబయ్య, జి.విక్రమ్, ఉపేందర్, అధ్యాపక బృందం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం పక్కన కటకం శ్రీనివాసరావు కాంప్లెక్స్ దగ్గర పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఆశ్రయ సేవా సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక మండల కేంద్రం నందు తలసేమియా చిన్నారుల కోసం ఏర్పాటు చేస్తున్న రక్తదాన శిబిరంను విజయవంతం చేయాలని బోనకల్ ఎస్సై పొదిలి వెంకన్న కోరారు. తలసేమియా వ్యాధితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు నాలుగు మందికిపైగా చిన్నారులు బాధపడుతున్నారని, వారి కోసం నిర్వహించే రక్తదాన శిబిరంలో ప్రతిఒక్కరూ పాల్గొని మానవతా ధృక్పథంతో రక్తదానం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రయ సేవా సొసైటీ జనరల్ సెక్రటరీ తగరం రమేష్, సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని రాస్తారోకో



ప్రజాపక్షం/ మధిర : రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు ఇచ్చిన హామీ మేరకు 42శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. పట్టణంలోని వైఎస్సాఆర్ చౌరస్తా నందు కేంద్ర ప్రభుత్వ దిష్టబొమ్మను దగ్ధం చేశారు. ఈసంద్భంగా సిపిఎం మధిర డివిజన్ క్యార్యదర్శి మదుపల్లి గోపాలరావు మాట్లాడుతూ బిసి బిలుపై కేంద్ర ప్రభుత్వానికి స్పష్టమైన డిమాండ్ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరుపై నేడు చేపట్టనున్న తెలంగాణ బంద్‌కు సిపిఎం పార్టీ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు స్పందించి బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నర్సింహారావు, పట్టణ, మండల కార్యదర్శులు పడికంటి మురళీ, మందా సైదులు, అనుమోలు భాస్కర్‌రావు, ఉపేందర్‌రావు, నాయుడు శ్రీరాములు, రామకిషోర్, శివయ్య, వెంకటనర్సయ్య, జాని తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా డిసిసి అధ్యక్షుని ఎన్నిక



ప్రజాపక్షం/ మధిర : ఖమ్మం జిల్లా డిసిసి నూతన కమిటీ అధ్యక్షుని నియామకం పారదర్శకంగా జరుగుతుందని ఎఐసిసి అబ్జర్వర్ మహేందర్ అన్నారు. శుక్రవారం స్థానిక రెడ్డి గార్డెన్‌లో అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మధిర నియోజకవర్గం నుండి ఏ బ్లాక్ మధిర, బోనకల్, ఎర్రుపాలెం మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నుండి ప్రతిఒక్కరిని విడివిడిగా పిలిచి అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షుని ఎన్నిక పారదర్శకంగా జరగటం కోసం గ్రామస్థాయి నుండి ప్రతి కాంగ్రెస్ నాయకుల అభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 42% బిసి రిజర్వేషన్ బంద్‌కు బిఆర్‌ఎస్ మద్దతు



ప్రజాపక్షం/వైరా: 42% స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణలో బిసి సంఘాలు అక్టోబర్18న చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ రాష్ట్ర బంద్‌కు బిఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తుందని, బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా బాణాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన బిసి ంద్‌కు బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని బంద్ విజయవంతం చేయాలని అన్నారు. 42% రిజర్వేషన్ కోసం బిసి వర్గాలు ఐక్యంగా చేస్తున్న కార్యక్రమాలను బిఆర్‌ఎస్ పార్టీ బలపరుస్తుంది. ఈ బంద్‌లో కార్మిక సంఘాలు, విద్యార్థి సంఘాలు కూడా పాల్గొని జయప్రదం చేయాలని బిఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## నేడు జరిగే బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు



ప్రజాపక్షం/వైరా: నేడు జరిగే బిసి బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని వైరా మండల సిపిఐ కార్యదర్శి యామాల గోపాలరావు తెలియజేశారు. 42% బిసి రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బంద్‌కు పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని కమ్యూనిస్టు పార్టీ బిసి సంఘాలకు అండగా ఉంటుందని తెలియజేశారు.

## నేడు జరిగే బంద్ కు సహకరించండి



ప్రజాపక్షం/సత్తుపల్లి: నేడు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న బంద్‌కు సత్తుపల్లి మండల ప్రజలు, విద్యా, వ్యాపార రంగాల వారు తమ సంపూర్ణ సహకారం అందిచాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అధ్యక్షతన కాంగ్రెస్, బిజెపి, టిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ, ఎంఆర్ పిఎస్ తదితర పార్టీలు, కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆద్వర్యంలో శుక్రవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ప్రతి షాపు వారిని పేరు, పేరునా పలకరించి బంద్‌కు సహకరించి షాపులు బంద్ చేసి బంద్ కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తోట సుజల రాణి గణేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, సిపిఎం నాయకులు మోరంపూడి పాండురంగారావు, సర్వేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు అమర్లపూడి శరత్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్యశాఖలో శ్రమ దోపిడీ

**-యాప్‌ల పేరుతో ఏఎన్‌ఎంలపై మానసిక ఒత్తిడి**
**-కలెక్టరేట్ వద్ద ఆందోళన**




ప్రజాపక్షం/ ఖమ్మం : వైద్య ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించి శ్రమ దోపిడీ పెరిగిపోతుందని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు తెలిపారు. నిర్బంధ పనిని నేరంగా పరిగణించాల్సి వస్తుందని అధికార యంత్రాంగం ప్రజాప్రతినిధులు గుర్తించాలని ఆయన కోరారు. శుక్రవారం ఏఎన్‌ఎంలపై పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఎన్‌సిడిని రద్దు చేయాలని దీని కారణంగా ఏఎన్‌ఎంలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. రక రకాల మొబైల్ అప్లికేషన్స్‌ను తీసుకు వచ్చారని ఇందులో కొన్ని అర్ధరాత్రి సమయంలో మాత్రమే పని చేస్తున్నాయని అప్పుడు అప్‌లోడ్ చేయడం తీవ్ర ఇబ్బందికరంగా మారిందన్నారు. వాస్తవానికి గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవడానికి అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవడం, మెరుగైన ఆరోగ్య సూచనలు అందించడానికి, చిన్న పిల్లలకు టీకాలు వేయడానికి ఏఎన్‌ఎంలను నియమించారన్నారు. కానీ మారుతున్న పరిస్థితుల రీత్యా కొంత కాలంగా వారు చేస్తున్న పనులకు సంబంధించి ఆన్‌లైన్ విధానాన్ని తీసుకు వచ్చారని రెండు యాప్‌లతో ప్రారంభమైన ఆన్‌లైన్ పద్ధతి ఇప్పుడు 14 మొబైల్ అప్లికేషన్స్‌ను పూర్తి చేయాల్సి రావడం ఇబ్బందికరంగా మారిందన్నారు. మానసిక ఒత్తిడిలో ఏఎన్‌ఎంలు అనారోగ్యానికి గురవుతున్నారని ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచన చేసి ఈ ఆన్‌లైన్ యాప్‌ల విధానానికి స్వస్తి పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు శ్రీలక్ష్మి, నాగమణి, సరస్వతి, రచ్చా సీత, విజయశ్రీ, దివ్య, ఫాతిమా, సంధ్య, రత్నమాల, మమత, లక్ష్మి, రెండవ ఏఎన్‌ఎంలు జయమ్మ, రాజ్యలక్ష్మి, రాజేశ్వరి, శోభ, సుగుణ, మంగమ్మ, మరియమ్మ, అరుణ, భవాని, మాణిక్యమ్మ, ఆదిలక్ష్మి, స్నేహ, మేరీ, గీత, వసంత తదితరులు పాల్గొన్నారు.

# పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలం

**-శతాబ్ది ఉత్సవ సభకు భారీగా జన సమీకరణ**
**-రైతు సంఘం సమావేశంలో గోవిందరావు**




ప్రజాపక్షం/ ఖమ్మం : అష్టకష్టాలు పడి రైతులు పండిస్తున్న వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి కొండపర్తి గోవిందరావు ఆరోపించారు. పాలకుల వైఖరి, సహకరించని ప్రకృతి నడుమ వ్యవసాయ రంగం రోజు రోజుకు సంక్షోభంలోకి కూరుకుపోతుందని ఆయన ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సమితి సమావేశం శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గోవిందరావు మాట్లాడుతూ గత మూడేళ్లుగా ఏ పంటకు కనీస మద్దతు ధర లభించ లేదని ఆరోపించారు. గతేడాది నుంచి వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆయన తెలిపారు. ఈ ఏడాది పత్తి దిగుబడి కనిష్ట స్థాయికి పడిపోయిందని ఎకరాకు క్వింటా నుంచి రెండు క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితి లేదన్నారు. పత్తిని సిసిఐ ద్వారా కొనుగోలు చేయాలని ఆన్‌లైన్ బుకింగ్ పద్ధతిని రద్దు చేయాలని క్వింటాకు రూ.10075 మద్ధతు ధర చెల్లించాలని గోవిందరావు డిమాండ్ చేశారు. గతేడాది సన్న ధాన్యానికి చెల్లించాల్సిన బోనస్ ఇంత వరకు చెల్లించలేదని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే బోనస్‌ను విడుదల చేయాలన్నారు. వరుసగా వస్తున్న ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని గ్రామం యూనిట్‌గా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిసారి రైతాంగ జపం చేస్తున్నాయి తప్ప ఆచరణలో రైతులకు చేస్తున్నది ఏమి లేదని గోవిందరావు తెలిపారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాలకు భారీ సంఖ్యలో రైతులను సమీకరించాలని రైతు సంఘం జిల్లా సమితి సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో రైతు సంఘ బాధ్యులు మిడికంటి వెంకటరెడ్డి, కూచిపూడి రవి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పుచ్చకాయల సుధాకర్, బాగం ప్రసాద్, మామిళ్ల సుదర్శన్‌రెడ్డి, అమరనేని వీరభద్రం, నల్లమోతు నర్సింహారావు, దొబ్బల కృష్ణ, వెంకటనర్సయ్య, చింతల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ని ప్రాణాలు పోతే ఈ రోడ్డు బాగు చేస్తారు..?

**-ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన రహదారి**
**-వర్షం పడితే చిత్తడే, ఎండపడితే గుంతలే ప్రజల ఆవేదన**





ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండల పరిధిలోని సీఎస్పీ నుంచి భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బి.టి.పి. ఎస్) వరకు ఉన్న రహదారి ప్రజలకు భయానకంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణం అంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. యమలోకానికి నేరుగా దారి తీస్తుందేమో అన్నట్టుగా ఈ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రతిరోజూ ద్విచక్రవాహనదారులు, ఆటోలు, స్కూల్ బస్సులు ఈ దారిలో నిత్యం ప్రయాణిస్తున్నా రహదారి మరమ్మత్తుల పట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొగ్గు లారీలు, ఇసుక లారీలు నిరంతరం ఈ దారిలో సంచరించడంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వర్షం పడితే చిత్తడై, సూర్యరశ్మి పడితే గుంతలతో నిండిపోతున్న ఈ రహదారిపై నడవడమే కష్టంగా మారింది. ప్రజల అభిప్రాయం ప్రకారం, ఈ బీటీ రోడ్లకు బదులుగా సిమెంట్ (సీసీ) రోడ్లు వేస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. అయితే, భద్రాద్రి పవర్ ప్లాంట్ అధికారులు "ఇది మా పరిధి కాదు" అని, సింగరేణి అధికారులు "మేము కాదు, ఆర్అండ్‌బీ శాఖ వేయాలి" అని ఒకరిపై ఒకరు బాధ్యత వదిలేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. భద్రాద్రి పవర్ ప్లాంట్‌కు నిత్యం బొగ్గు సరఫరా చేయాల్సి ఉంటుంది. అదే సమయంలో గోదావరి పరివాహక ప్రాంతాలైన రామానుజవరం, సాంబాయిగూడెం, విజయనగరం, మణుగూరు ప్రాంతాల నుంచి ఇసుక లారీలు కూడా నిరంతరం ఈ రహదారిపై తిరుగుతున్నాయి. దీంతో ప్రతి రోజు వందల లారీలు రాకపోకలు జరుపుతుండగా, రహదారి నిత్యం దెబ్బతింటూ ఉంది. ఇప్పటికీ అనేక ప్రమాదాలు జరిగినా సంబంధిత శాఖలు పెద్దగా స్పందించడం లేదు. ఈ రహదారి పొడవు కేవలం 10 కిలోమీటర్ల లోపే అయినా, దాని పరిస్థితి రాష్ట్రంలోని అత్యంత దారుణ రహదారులలో ఒకటిగా మారింది. ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఈ దారిలో రోజూ ప్రయాణిస్తున్న నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి రహదారిని సీసీ రోడ్డుగా మారిస్తే ప్రజలు సంతోషిస్తారు. ఇంకా ఎన్ని ప్రాణాలు పోతే ఈ రోడ్డు బాగు చేస్తారు? ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపించండి అని ప్రజలు అభ్యర్థిస్తున్నారు.

# డిసెంబర్ 26న జరిగే సభ చరిత్రలో నిలిచిపోవాలి

**సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**




ప్రజాపక్షం/చింతకాని : డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ధి ఉత్సవాల ముగింపు సభ చరిత్రలో నిలిచిపోయే విధంగా జరపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం చింతకాని మండల సిపిఐ మండల సమితి సమావేశం చాట్ల రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ సిపిఐ శతాబ్ధి ఉత్సవాల ముగింపు సభ ఖమ్మంలో జరగటం చాలా అదృష్టం అన్నారు. ఈ సభకు దేశం నలుమూలల నుంచి ప్రతినిధులు వస్తున్నారని ఈ సభకు ఊరూ వాడ తరలిరావాలన్నారు. ఇప్పటి నుంచే గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరిని ఈ సభకు వచ్చే విధంగా ఉత్తేజపరచాలన్నారు. కవాతు దళాలను, మహిళలను, రెడ్ షర్ట్ వాలింటర్లను చింతకాని మండలం నుంచి భారీగా తరలించాలన్నారు. పార్టీ వందేళ్ల పండుగను ప్రతి ఇంటి పండుగగా భావించా విధంగా గ్రామల్లో వాల్‌రైటింగ్ , ఇంటింటి ప్రచారం నిర్వహించాలన్నారు. చింతకాని మండలం నుంచి 5వేలకు తగ్గకుండా తరలి వచ్చే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, కూచిపుడి రవి, జిల్లా సమితి సభ్యులు దూసరి శ్రీరాములు, పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శులు మార్గం శ్రీను, అబ్బూరి మహేష్, రైతు సంఘం మండల అధ్యక్షులు దొబ్బల వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

# ట్రేడ్ లైసెన్స్‌లు అక్రమ వసూళ్లపై అధికారులు మౌనం ఎందుకు..?

**-ట్రేడ్ లైసెన్స్ దందా వెనుక ఉన్న ఆ అధికారి ఎవరు?**
**-ట్రేడ్ లైసెన్స్‌ల బాధ్యత తీసుకున్న అధికారి ఎక్కడ**
**-కొలతల తేడాతో మున్సిపాలిటీ ఆదాయానికి గండి**




ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీలో అక్రమ ట్రేడ్ లైసెన్స్‌ల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారు. వారి మౌనం వెనుక ఆంతర్యం ఏమిటి? మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతూ అక్రమ పద్ధతిలో కొలతలు తప్పుగా వేసి ట్రేడ్ లైసెన్స్ ఫీజులు తగ్గిస్తున్నారనే వాదన బలంగా వినిపస్తూ ఉంది. అలాంటి అవినీతిని ప్రోత్సహిస్తున్న ఆ అధికారి ఎవరు, వారి వెనుక ఉండి నేనున్నాను మీకు అంటూ అవినీతికి వెన్నుదన్నుగా ఉంటూ ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకొని దందా నడిపిస్తున్న ఆ అధికారి ఎవరు, వైరా మున్సిపాలిటీలో వ్యాపార సముదాయాల నిర్వహణలో ఇటీవల కాలంలో వేసిన కొలతలను ఒక్కసారి పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వస్తాయి. కాని అధికారులు ఎందుకు వాస్తవాన్ని బయట పెట్టడానికి వెనకడుగు వేస్తున్నారు. అసలు ట్రేడ్ లైసెన్స్ బాధయతలు తీసుకున్న ప్రభుత్వ అధికారి ఎవరు, ఆ అధికారికి బాధ్యతలు ఇచ్చిన తర్వాత ప్రత్యేక బృందాన్ని మరో అధికారి ఏర్పాటు చేయడం ఏమిటి? ట్రేడ్ లైసెన్స్ బాధ్యతలు అప్పజెకప్పిన అధికారి ఎందుకు విధులకు పోవడం లేదు. మిగతా బృందాన్ని తయారు చేసి ఎందుకు పంపిస్తున్నారు. అసలు అధికారి ఏమైపోయాడు. ఆఫీస్‌కు వస్తున్నాడా రావడం లేదా అనేది కూడా తెలియాల్సిన అవసరం ఉంది. ట్రేడ్ లైసెన్స్ విధులు నిర్వహించాల్సిన ప్రభుత్వ అధికారి వసూళ్ల పర్వానికి పోకుండా ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఎందుకు పంపిస్తున్నారు. అసలు అతను విధులు ఎందుకు సక్రమంగా నిర్వహించడం లేదు. ఇప్పటికే వైరా మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అవినీతిపై పలు పార్టీలు ఆందోళన చేయడం నిరసన చేపట్టడం కూడా తెలుస్తూనే ఉంది. మరువక ముందే మరో రూపంలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుందనే చెప్పవచ్చును. జిల్లా కలెక్టర్ ట్రేడ్ లైసెన్స్‌లు దందాపై విచారణ చేపడితే అసలు రూపం బయటికి వస్తుంది.

# శాస్త్రీయ విద్యా విధానమే అంతిమ లక్ష్యం

**-ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం**
**-ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్**



ప్రజాపక్షం/మణుగూరు: శాస్త్రీయ విద్యా విధానమే అంతిమ లక్ష్యం అని, విద్యా వ్యాపారీకరణకు వ్యతిరేకంగా విద్యార్థుల ఐక్యం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అజిత్ మాట్లాడుతూ 1936 ఆగస్టు 12 ఉత్తరప్రదేశ్ లోని లక్నో బెనారస్ విశ్వవిద్యాలయంలో పొత్తిళ్ళలో పిడికిలి బిగించి దేశ స్వతంత్రం కోసం ఆనాడు విద్యార్థులను, యువకులను ఏకం చేస్తూ నేటి వరకు 90 వసంతాలను పూర్తి చేసుకున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్)విద్యార్థి సంఘంలో విద్యార్థులు అందరూ భాగస్వాములై విద్యారంగ సమస్యల పరిస్కారం కోసం చదువుకునే ప్రతి ఒక విద్యార్థి ఏఐఎస్ఎఫ్ సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఏఐఎస్ఎఫ్ చేస్తున్న పోరాటాలు స్వాతంత్ర్యం నాటి నుండి ఇప్పటివరకు చేసిన పోరాటా త్యాగల స్పూర్తితోటి రాజ్యాంగ పరిరక్షణకు దేశ ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం విద్యార్థులు వారి పాత్ర పోషించాలని లక్ష్యం తోటి ఏఐఎస్ఎఫ్ రాజకీయ లక్ష్యాలను విద్యార్థులకు చూపిస్తుందని అన్నారు. కార్పొరేట్ ప్రైవేటీకరణ మీద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాల పై విద్యార్థులు సంఘటితం కావాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ సభ్యత్వం తీసుకోవడం అంటే ఈ జిల్లాలో, ఈ రాష్ట్రంలో, దేశంలో ఒక ప్రధానమైన పాత్ర విద్యార్థులు పోషించే విధంగా ఏఐఎస్ఎఫ్ చేసే పోరాటాలను విద్యార్థులే హక్కును చేర్చుకోవాలని శాస్త్రీయ విద్యా విధానానికై కృషి చేయాలని అన్నారు. ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని సమ సమాజ స్థాపన కై ఏఐఎస్ఎఫ్ చేసే పోరాటాలలో భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్క విద్యార్థి మారుతున్న సమాజానికి అనుగుణంగా అధ్యయనం పోరాటం నినాదంతో ముందుకెళ్లాలని, భవిష్యత్తులో ఏఐఎస్ఎఫ్ చేయబోయే అన్ని పోరాటాలలో విద్యార్థులు భాగస్వాములు కావాలని అజిత్ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి పవన్ సాయి, కళ్యాణి, సుప్రియ, మానస తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీల జాబితా ఆన్‌లైన్ అనుసంధానం



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని 23 గ్రామపంచాయతీలలో ఉపాధి హామీ కూలీల జాబితాను ఆన్లైన్లో పొందుపరుస్తున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్, హేమమాలినిలు తెలిపారు. ఆధార్ ,బ్యాంకు ఖాతా, కనుబొమ్మలు మండలంలో ఉన్న 13వేల మంది ఉపాధి హామీ కూలీలు యొక్క జాబితాను ఆన్లైన్లో అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో, ఈజీఎస్ ఏపిఓ, టి ఏ లు సమీక్ష చేస్తున్నారు. ఇప్పటివరకు 10,000 మంది జాబితాను ఆన్లైన్లో పొందుపరిచినట్లు ఈనెల పూర్తిస్థాయిలో పొందుపరుస్తున్నామని వారు తెలిపారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మెట్లు చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, చెన్నూరు బత్తులపల్లి ,ముచ్చవరం, పేరువంచ తదితర గ్రామాలలో పూర్తి కావచ్చు అని ఈ నెల చివరికెల్లా పూర్తవుతుందని వారు తెలిపారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



ప్రజాపక్షం/భద్రాచలం : బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలంతా బంద్‌కు సహకరించాలని, అత్యవస సేవలు తప్ప మిగతా వ్యాపార వర్గాలు సహకరించాలని కోరారు. బిసి రిజర్వేషన్ సాధించే వరకు సిపిఐ తన వంతు పోరాటాన్ని నిర్వహిస్తుందని, ప్రజలు ప్రయాణాలను సైతం వాయిదా వేసుకోవాలని, వ్యాపార వర్గాలు సహకరించాలని అన్నారు.

## ఏఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : బిసి రిజర్వేషన్ 42 శాతం అమలు చేయాలని కోరుతూ నేడు తలపెట్టిన బంద్‌కు ఏఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వరక అజిత్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బంద్‌లో జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛందంగా పాల్గొంటారని చెప్పారు. బిసి రిజర్వేషన్ సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలో ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలన్నారు. రిజర్వేషన్ అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.బిజేపి కులతత్వ మనువాద పార్టీ అయినందున కుల వ్యవస్థలో అసమానతలు ఉండాలని, మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కోరుతుందని ఆరోపించారు. బిసిల పట్ల బిజేపికి చిత్తశుద్ధి ఉంటే 9వషెడ్యూల్‌లో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఇనపల్లి పవన్ సాయి నాయకులు మంజుల, కవిత, లాస్య, మహేష్, నవీన్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రమేష్‌కు పరామర్శ



ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని కృష్ణసాగర్ గ్రామ పంచాయితీ గ్రామ కమిటీ అధ్యక్షులు అంతోటి రమేష్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నా రు. ఈవిషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి పరామర్శించారు. ఈసందర్భంగా అరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఏఎంసి మాజీ ఛైర్మన్ పొడియం ముత్యాలమ్మ, సొసైటీ డైరెక్టర్ ఉండేటి గోవర్ధన్, ముసలమడుగు గ్రామ పంచాయితీ మాజీ సర్పంచ్ కుర్సం వెంకటరమణ, నాయకులు కుర్సం వెంకన్న, భూక్య మోహన్, భూక్య ఉపేందర్, ఉసిల్ల రాజేష్, అంతోటి నాగరాజు, నాగటి జాన్, యస్వంత్, భూక్య కృష్ణ, తదితరులు ఉన్నారు.

## నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం



ప్రజాపక్షం/బూర్గంపాడు: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యమని ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టీ భరత్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మోరంపల్లి బంజర్ గ్రామంలో నాణ్యమైన విత్తనం కార్యక్రమంలో వరి పంటలో డబ్ల్యూజియల్ 44 సిద్ధిరకంపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. అనంతరం డాక్టర్ హేమ శరత్ చంద్ర మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు సేవ చేయడానికి, వివిధ రకాల సాంకేతిక పద్ధతుల్ని, సమయానుగుణంగా శిక్షణ కార్యక్రమాలతో పాటు నాణ్యమైన వంగడాలని అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా డబ్ల్యూజియల్ 44 సిద్ధిరకం వేసిన క్షేత్రాన్ని శాస్త్రవేత్తలు సందర్శించారు. ఈకార్యక్రమంలో ఏఈవో నాగవైష్ణవి, రైతులు కైపు సుబ్బిరామిరెడ్డి, బత్తుల రామకొండరెడ్డి, గాదె నర్సిరెడ్డిలు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



ప్రజాపక్షం/ బోనకల్ : బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బోనకల్ మండల కేంద్రంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ దిష్ట బొమ్మను దగ్ధం చేశారు. ఈసందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కిలాసురేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని, స్థానిక ఎన్నికల్లో ఆ హామీని నెలబెట్టుకుని బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలయ్యే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కమిటీ సభ్యులు బంధం శ్రీనివాసరావు, జొన్నలగడ్డ సునీత, మండల కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు, వివిధ గ్రామాల పార్టీశాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే ఆయిల్‌ఫామ్ సాగులో తెలంగాణ నెంబర్ వన్

**- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** దేశంలోనే ఆయిల్‌ఫామ్ సాగులో తెలంగాణను నెంబర్ స్థానంలో నిలుపుతానని, రాష్ట్రమంత ఆయిల్‌ఫామ్‌కు యోగ్యమైన భూములు 20లక్షల పైగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం నారవారి గూడెంలోని ఆయిల్‌ఫామ్ నర్సరీలో మొక్కల పెంపకంపై రైతులతో ముఖాముఖీ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ జ్ఞానోదర్మా పామాయిల్ రైతులను తీవ్రం భాదిస్తుందని, 45లక్షల ఎకరాల పత్తి పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, మొక్కజొన్న రైతాంగం కూడా ఆశించిన లాభాలు పొందలేదని తెలిపారు. తెలంగాణలో 20లక్షల ఎకరాల పామాయిల్ సాగుకు అవకాశం ఉందని, కనీసం 10లక్షల ఎకరాల సాగు మా లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలో మొత్తం పండించిన పామాయిల్ పంటని క్రషింగ్ చేసే సామార్థ్యం సిద్దిపేట ఫ్యాక్టరీకి ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలకు పామాయిల్ ఫ్యాక్టరీలు తెచ్చి ఆయిల్ ఫెడ్‌ను బలోపేతం చేస్తామన్నారు. అశ్వారావుపేట హర్టికల్చర్‌లో ఉన్న 250 ఎకరాల్లో అన్ని రకాల పంటలు వేసి రైతులకు శాస్త్రీయ విధానాలు తెలియచేసే ఏర్పాటు చేయాలన్నారు. పామాయిల్ పెరిగే విధంగా ఇక్కడ మలేషియా వాతావరణం వచ్చిందని, భారతదేశం మొత్తం అశ్వారావుపేట వైపు చూసే రోజులు వస్తాయన్నారు. భవిష్యత్‌లో హైబ్రీడ్ పొట్టి విత్తనాలు, నాణ్యమైన విత్తనాలు అశ్వారావుపేట నర్సరీ నుండి బయటకు రావాలని, హర్టికల్చర్ విద్యార్థులను కూడా మలేషియా తీసుకెళ్లి అక్కడి వ్యవసాయ పద్దతులను చూపించడం జరుగుతుందని తెలిపారు. అప్పారావుపేట, అశ్వారావుపేట పామాయిల్ సాగుని ఇతర జిల్లాల రైతులు ఎలా చూస్తున్నారో రాబోయే రోజుల్లో తెలంగాణాన్ని ప్రపంచదేశాలు చూస్తాయని అన్నారు. పామాయిల్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి, ఎఎంసి చైర్మన్ వాసం రాధ, కాంగ్రెస్ నాయకులు చెన్నకేశవరావు, బండి భాస్కర్‌రావు, సుదర్శన్‌రావు, మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# విత్తన మొక్కజొన్న రైతులు జాగ్రత్తగా ఉండాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం ఖానాపురం గ్రామంలో వ్యవసాయశాఖ అధికారులు విత్తన మొక్కజొన్న సాగు చేయు రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నయాన్ మంజుఖాన్ రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులు ఆయా ఏజెంట్ల నుండి రకరకాల కంపెనీల నిర్వాహకులు గ్రామాలకు వచ్చి మా విత్తనాలు తీసుకొని చెబుతారు. అలాంటి సందర్భంలో విత్తనాలు తీసుకునే రైతులు ఇచ్చే కంపెకనీల నుండి అగ్రిమెంట్ పత్రం తీసుకోవాలని తెలిపారు. లోకల్‌లో తెలిసిన వారని విత్తనాలు తీసుకొని మోసపోవద్దని తెలిపారు. విత్తన కొట్టుకు వెళ్లినప్పుడు కూడా విత్తనాలకు బిల్లు తీసుకోవాలని అన్నారు. కిసాన్ రైతు యాప్‌ను పత్తి సాగు చేసే రైతులు ఉపయోగించుకొని అవగాహన కల్పించుకోవాలి. సిసిఐ పత్తి అమ్మకాలకు కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని, పంటల సర్వే నిర్వహించినప్పుడు ఇచ్చిన మొబైల్ నెంబర్‌ను వాడుకలో ఉండేవిధంగా చూసుకోవాలని సూచించారు. రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సైదులు, రాజేష్, పలు రైతులు పాల్గొన్నారు.

# బీసీలకు 42% శాతం రిజర్వేషన్ ఇవ్వాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సిపిఎం సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బీసీలకు 42% శాతం రిజర్వేషన్ ఇవ్వాలని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్ లు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై బిజెపి నాటకం ఆడుతుందని, కేంద్రంలో అడ్డుకుంటూ రాష్ట్రంలో బందుకు మద్దతు అంటూ రెండు నాలికల ధోరణి ప్రదర్శిస్తుందని విమర్శించారు. ఈ ద్వంద వైఖరి బిజెపి మానుకొని కేంద్రంలో బిల్లును ఆమోదించి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్రంపై బీసీ జేఏసీ పోరాడితేనే 18న రాష్ట్ర బంద్‌కు సిపిఎం మద్దతిస్తుందని సిపిఎం కూడా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కాంగ్రెస్ అఖిలపక్షం నిర్వహించి కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలన్నారు. బిజెపి ఒకవైపు కేంద్రంలో బీసీ రిజర్వేషన్స్ బిల్లులు, ఆర్డినెన్స్ లు అడ్డుకుంటూ ఇంకోవైపు రాష్ట్రంలో ఈనెల 18న బీసీ జేఏసీ రాష్ట్ర బందుకు బిజెపి మద్దతు ఇస్తామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్, చలమాల విఠల్‌రావు, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు తన్నీరు కృష్ణార్జునరావు, రామలింగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు రావుల రాజబాబు, మహిళా సంఘం నాయకులు చెరుకు రత్నకుమారి, సిపిఎం పార్టీ టౌన్ నాయకులు మోరంపూడి వెంకట్రావు, రామకృష్ణ,శివ వెంకటేశ్వరరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ కాలువలో గల్లంతైన బాలుడు మృతి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** చేపల వేటకని వెళ్లి బుధవారం సాగర్ కాలువలో గల్లంతయిన బాలుడు రేపల్లె మనోజ్ (14) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే పెనుబల్లి మండలం విఎం బంజర్ జంగాల కాలనీకి చెందిన రేపల్లె మనోజ్, మరో బాలుడు పర్వతం శివ తుమ్మల పల్లి గ్రామం వద్ద నాగార్జునసాగర్ కెనాల్ లో గాలాలతో చేపలు వేట]ని వెళ్లారు. రేపల్లె మనోజ్ ప్రమాదవశాత్తు కాలువలో పడిపోగా మరో బాలుడు శివ రక్షిద్దామని ప్రయత్నించగా ఆ బాలుడు కూడా కాలువలో పడిపోయాడు. ఇది గమనించిన పక్కనే ఉన్న మేకల కాపరి ఒక బాలుడుని రక్షించగా మరో బాలుడు మనోజ్ (14) గల్లంతు అయ్యాడు. సమాచారం అందుకున్న వియ్యం బంజర్ ఎస్సై కే. వెంకటేష్ తన సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని గల్లంతయిన బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం సాగర్ కాలవలో విగత జీవిగా కనిపించాడు. పోస్టుమార్టం బాలుడి మృతదేహాన్ని పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాలువలో విగతజీవిగా కనిపించడంతో జంగాల కాలనీలో విషాదం నెలకుంది. ఈ ఘటనపై వియం మందిరం పోలీస్ స్టేషన్ ఎస్ఐ కే. వెంకటేష్ విచారణ చేపట్టారు.

# కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** కపాస్ కిసాన్ యాప్‌పై పత్తి రైతులకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండల పరిధిలోని రాంక్యాతండా గ్రామంలో పత్తి పంటలను ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి విక్రయానికి సంబంధించి రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు. స్లాట్ బుకింగ్ ఆధారంగా ఆ తేదీన సమీపంలోని జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తిని విక్రయించుకోవాలని సూచించారు. స్మార్ట్ ఫోన్లలో కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఆధార్, ఫోన్ నెంబర్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. మొక్కజొన్న పండించే రైతులు రిజిస్టర్ కంపెనీల నుంచి మాత్రమే విత్తనాలను తీసుకోవాలని సూచించారు. విత్తనాలు తీసుకునే ముందు కంపెనీ ద్వారా బాండ్ తీసుకోవాలన్నారు. నకిలీ కంపెనీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వి. సాయివేదవ్యాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మండలస్థాయి ఆటల పోటీలకు షెన్‌స్కూల్ విద్యార్థుల ఎంపిక



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని రావినూతల హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో సీనియర్ అండ్ జూనియర్ కేటగిరి పోటీల్లో షైన్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి మండల స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అన్సార్ పాషా మాట్లాడుతూ మొత్తం 11మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులతో పాటు ఎంపికైన పిల్లలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత జరిగే పోటీల్లో కూడా ఇలాగే ప్రతిభ కనబర్చి మన మండలానికి మంచి పేరు తేవాలని అన్నారు. ప్రిన్సిపాల్ ఎ.శ్వేత, అడ్మినిస్ట్రేషన్ పి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, పిఇటి వి.రాజశేఖర్ తదితరులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

# అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలం లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలో చేపట్టిన భవిత భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్ర మాణాలు పాటించాలని, త్వరితగతిన పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎంఇఓ పుల్లయ్య, ఎఇ నాగేశ్వరరావు, ఐఇఆర్‌పి టీచర్ పుల్లారాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జంట హత్యల కేసులో నిందితుడికి జీవితఖైదు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని నారాయణపురంలో తల్లికొడుకుల గొంతు కోసి అమానుషంగా హత్య చేసిన ఘటనలో నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.25వేల జరిమానా విధిస్తూ 6వ అదనపు జిల్లాజడ్జీ మారగాని శ్రీనివాసరావు శుక్రవారం సంచలన తీర్పు వెల్లడించారు. సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన రాయల తులసమ్మ, సత్యనారాయణలను అదే గ్రామానికి చెందిన దర్శనపు సునీల్ 2023 జూలై 31న హత్య చేశాడు. ఇరువర్గాల వాదనలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయాధికారి పైవిధంగా తీర్పు ఇచ్చారు.

# మిరాకిల్ మైండ్స్ పాఠశాల విద్యార్థుల విజ్ఞాన యాత్ర



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణ పరిధిలోని మిరాకిల్ మైండ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ప్రాథమికంగా విద్యను ప్రారంభించిన (యూ.కే.జీ) విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం క్షేత్ర పరిశీలనను శుక్రవారం ఏర్పాటు చేశారు. అధ్యాపక బృందం చిన్నారి విద్యార్థులను ప్రభుత్వ కార్యాలయాలు పోలీస్ స్టేషన్, ఫైర్ స్టేషన్, పోస్టాఫీస్, మున్సిపల్ కార్యాలయం సందర్శింపజేసి అధికారుల విధులను వివరించారు. విద్యతో పాటు భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలకు ఏ అధికారిని సంప్రదించాలి అనే విషయంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రత్నాకర్ మాట్లాడుతూ మీరాకిల్ మైండ్స్ విద్యార్థులను విద్యతోపాటు అన్ని రంగాల్లో ప్రథములుగా చేయడమే ఉద్దేశంగా పెట్టుకున్నామని దానిని సాధించడానికి అధ్యాపక బృందంతో కలిసి శ్రమిస్తున్నట్లు తెలిపారు.

# బిసి రిజర్వేషన్ బిల్లులో అడ్డంకులు సృష్టిస్తున్న కేంద్రం



**- 42 శాతం రిజర్వేషన్ సముచితమే**
**- నేడు జరిగే బంద్‌తో కేంద్ర దిగిరావాలి**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా**
**- శేషగిరి భవన్‌లో రౌండ్ టేంబుల్ సమావేశం**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాజకీయ పరమైన వక్రబుద్ధితోనే కేంద్రంలోనికి బిజేపి ప్రభుత్వం 42 శాతం బిసి రిజర్వేషన్ బిల్లు అమలులో అడ్డంకులు సృష్టిస్తోందని, దీనిని తెలంగాణ సమాజం తిప్పికొట్టి కేంద్రానికి బుద్ధి చెప్పాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. రాష్ట్ర బిసి జేఏసి పిలుపు మేరకు నేడు జరగనున్న బంద్‌ను జయప్రథం చేయాలని, బంద్ విజయవంతం కోసం చేపట్టాల్సిన కర్తవ్యాలపై రాజకీయ పక్షాలు, బిసి, సమాజిక, జర్నలిస్టులు, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేండ్ సమావేశానికి ఆయన ముఖ్యాతిధిగా హాజరైన మాట్లాడారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ బిసి వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తేనే వారికి సముచిత న్యాయం జరుగుతుందని, దీనిపై రాష్ట్రసభల్లో ఆమోదం చేసి పంపితే బిల్లుకు ఆమోదం తెలపకుండా కేంద్ర కుట్ర చేస్తోందని విమర్శించారు. తెలంగాణ చట్టసభలు, రాష్ట్ర ప్రజలు సంపూర్ణంగా మద్దతు తెలుపుతుంటే కేంద్రానికి వచ్చిన ఇబ్బందేంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో బిసి వర్గాల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ వారికి సమాజిక, ఆర్థిక, రాజకీయ ప్రాతనిధ్యంలో తీరని అన్యాయం జరుగుతోందని, ఇక్కడి ప్రజల ఆకాంక్షలను మనోభావాలను కేంద్రం గుర్తించకుండా బిసి వర్గాల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తన్నారని మండిపడ్డారు. కేంద్ర స్పందించి బిల్లుకు ఆమోదం తెలిపేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే ఉద్యమాల ద్వారా కేంద్రానికి కనుకు లేకుండా చేస్తామని హెచ్చరించారు. నేడు జరిగే బంద్, నిరసన ఉద్యమాల ద్వారా కేంద్రానికి తెలంగాణ ప్రజల ఐఖ్యతను, పోరాట సత్తాను చవిచూపించాలని పిలుపునిచ్చారు. ధీటి లక్ష్మీపతి అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేండ్ సమావేశంలో విపక్ష పార్టీలు, బిసి మైనార్టీ సమాజిక, జర్నలిస్టు సంఘాల నాయకులు కంచర్ల జమలయ్య, గొల్లపల్లి దయానంద్, రజాక్, అనుదీప్, కాసుల వెంకట్, వంగ వెంకట్, మద్దెల శివకుమార్, జక్కుల రాములు, యూసుఫ్ అబీద్, కురుమెళ్ల శంకర్, భూపతి శ్రీను, కోడి లింగయ్య, డి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ అధికారులపై కొడవలితో దాడి

**-స్వల్ప గాయాలతో బయటపడ్డ ఫారెస్ట్ అధికారులు**
**-కరకగూడెంలో ఉద్రిక్త పరిస్థితులు**
**-వేట కొడవళ్ళతో దాడి చేసిన పోడు గిరిజన రైతులు..?**



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలంలో పోడు భూములలో ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్నాయి.శుక్రవారం అశ్వాపురం పాడు అటవీ ప్రాంతంలో వలస గిరిజనులు వేట కొడవళ్ళతో బీట్ ఆఫీసర్ పై మందు మత్తులో కోటిని చితకబాదారు. భయంతో పై అధికారులకు సెక్షన్ ఆఫీసర్ గోవిందు, కోటి దాడి వివరాలు చెప్పారు. పోడు భూములు కొట్టడం తప్పు కదా అని గోవిందు అడగగా గోవిందుని కూడా గొడవలతో గొడ్డలితో కొట్టారు. ఏం జరిగిందని అడగగా గుత్తి కోయలు కత్తులతో గొడ్డలతో దాడి చేశారు. దీంతో అధికారులకు స్వల్ప గాయాలు కాగా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై పీవీ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బీసీలను మరోమారు మోసం చేసే కుట్ర



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** బీసీలను రిజర్వేషన్ పేరుతో ప్రభుత్వం మరోమారు కుట్ర చేస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య ఆరోపించారు. మండల కేంద్రం లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్ హామీ న్యాయస్థానాల పేరుతో కాలయాపన చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ మోసం ను బీసీలు గమనించాలని సూచించారు. విద్యా, ఉద్యోగాలు, పదోన్నతులు, స్థానిక సంస్థల ఎన్నికలలో చట్టసభలలో రిజర్వేషన్ సాధనలో తాము పాలుపంచకుంటుమని పేర్కొన్నారు. శనివారం బీసీ సంఘాలు తలపెట్టిన తెలంగాణ బంద్ కు పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా బంద్ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ విలేకర్ల సమావేశంలో సోసైటీ చైర్మన్ లు నాగుబండి శ్రీనివాసరావు, కోటి బీసీలను రిజర్వేషన్ పేరుతో ప్రభుత్వం మరోమారు కుట్ర చేస్తుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్ హామీ న్యాయస్థానాల పేరుతో కాలయాపన చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ మోసం ను బీసీలు గమనించాలని సూచించారు. విద్యా, ఉద్యోగాలు, పదోన్నతులు, స్థానిక సంస్థల ఎన్నికలలో చట్టసభలలో రిజర్వేషన్ సాధనలో తాము పాలు పంచకుంటుమని పేర్కోన్నారు. శనివారం బీసీ సంఘాలు తలపెట్టిన తెలంగాణ బంద్ కు పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా బంద్ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ విలేకర్ల సమావేశంలో సోసైటీ చైర్మన్ లు నాగుబండి శ్రీనివాసరావు, కోటి సైదిరెడ్డి,మరికంటి రేణుబాబు, షేక్ హుస్సేన్, కమదన ప్రవీణ్, మాదాసు ఆదాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు సత్కారం

**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలం కొత్తగూడెం గ్రామం లో హేస్టలాతాన్ అనే ఒక క్రీడా విభాగంలో జాతీయ స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరచిన ఆదివాసీ యువతి తోలేం శ్రీ తేజ విజయాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆమె తల్లిదండ్రులను ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక (జేఏసీ) కరకగూడెం మండల కమిటీ సత్కరించింది. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీ తేజ జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవడం ఆదివాసీ సమాజానికి గర్వకారణమని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. శ్రీ తేజ ప్రతిభ వెనుక తల్లిదండ్రుల త్యాగం, ప్రోత్సాహం ఎంతో కీలకమని వారు అభిప్రాయపడ్డారు. గిరిజన గ్రామాలలో ఇలాంటి ఆదివాసీ ఆణిముత్యాలు ఇంకా ఎంతోమంది పేదరికంలో మగ్గిపోతున్నారని, అటువంటి వారిని గుర్తించి ప్రభుత్వం తరపున ఆర్థికంగా ప్రోత్సహించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఆదివాసీ ఉద్యమ నాయకులు పి. వెంకట్ నారాయణ, కలం సాంబమూర్తి, చంద రామకృష్ణ, మలకం నరేష్, ఊకే గణేష్, కంగాల సురేష్ గ్రామ పెద్దలు, యూత్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్యదర్శులపై తప్పుడు ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలి

**ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన ఎంపీడీవో, పోలీసులకు ఫిర్యాదు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** పంచాయతీ కార్యదర్శులను బెదిరిస్తూ, బ్లాక్ మెయిల్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం డిమాండ్ చేశారు. మండలం లోని చెన్నారం పంచాయతీ కార్యదర్శి ని డబ్బుల కోసం వేధించారని, ఇవ్వకపోవటంతో సోషల్ మీడియా లో అసత్య ప్రచారం చేసి, మనోవేదన కు గురి చేశారని శుక్రవారం కార్యదర్శులు నిరసన కార్యక్రమం చేపట్టారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం ను ఎంపీడీఓ కు అందించారు. సదరు వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడారు. వారి స్వార్థం కోసం కార్యదర్శులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే వారి పై చర్యలు తీసుకోకుంటే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## బిసిల బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు



**ప్రజాపక్షం/భద్రాచలం :** 42 శాతం రిజర్వేషన్ సాధన కోసం బిసి సంఘాలు తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తే వారికి సముచిత స్థానం దక్కుతుందన్నారు. బిల్లుకు అమోదం లభించకుండా బిజేపి కుట్ర పన్నుతోందని విమర్శించారు. తెలంగాణ చట్ట సభలు మద్దతు తెలిపినప్పటికీ మోడి సర్కార్‌కు మోకాళ్లడ్డటం వెనుక ఆంతర్యమేమిటన్నారు. బిసిల హక్కులను కాలరాసే విధంగా కేంద్రం ప్రయత్నిస్తుందని, ఇప్పటికైన బిల్లుకు ఆమోదం తెలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని చెప్పారు.

## బీసి సామాజిక వర్గాలు ఒక్కటవ్వాలి




**ప్రజాపక్షం/పాల్వంచ :** వెనుకబడిన సామాజిక వర్గాలకు చెందిన ప్రతీ ఒక్కరు ఐకమత్యంగా పోరాడి మన హక్కులను సాధించుకోవాలని కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షులు బాడిశ శంకర్‌రావు పిలుపునిచ్చారు. ఆ సంఘం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సంధర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేన్‌లి కల్పిస్తూ చట్ట సభల్లో తీర్మాణం చేసి గవర్నర్‌కు పంపించారని అన్నారు. కొన్ని సాంకేతిక మస్యలతో రిజర్వేషన్‌లను తొక్కిపెట్టటం కరెక్టు కాదన్నారు. దీనికి వ్యతిరేకంగా జరుపతలపెట్టిన రాష్ట్ర బంద్‌లో బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారు ఒక్కటై మద్దతు పలికి బంద్‌ను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మహిళా సంఘం నాయకులు మల్లెల ఉషారాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగులసు దర్శన్, వైస్ ప్రసిడెంట్ నిదానపల్లి బాలక్రిష్ణ, ట్రెజరర్ కారంపల్లి రామ్మోహన్, వర్కింగ్ ప్రసిడెంట్ కొమరంపల్లి సత్యనారాయణ, జిల్లా ఉద్యోగుల అద్యక్ష్య, కార్యదర్శులు మల్లెలశ్రీనివాస్, కటుకూరి నాగేశ్వరరావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ సీనియర్ నాయకులు రామయ్య మృతి



**ప్రజాపక్షం/మణుగూరు:** మండల పరిధిలోని సాంబాయిగూడెం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు ఎల్లు రామయ్య (60) శుక్రవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలియగానే సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మణుగూరు మండల, పట్టణ కార్యదర్శి జక్కుల రాజబాబు, దుర్గ్యాల సుధాకర్, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, ఎడారి రమేష్, ఎస్ కే సర్వర్, ఆధర్ల రాములు, పులిగల రమేష్, నోముల రవి, శాఖ కార్యదర్శి లక్ష్మి రెడ్డి, యాకూబ్, కొత్తపల్లి సీతారాములు తదితరులు హాజరై రామయ్య పార్థీవదేహంపై ఎర్ర జెండా కప్పి పూలమాలవేసి, రామయ్య అమర్‌హై అంటూ నినాదాలు చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మురళి, యాదిరెడ్డి, యాకయ్య, వంగమల్లయ్య, రాజు తదితరులు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ సిపిఐ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వాడని, యుక్త వయసు నుండే ఎర్రజెండా అంటే ఎనలేని ప్రేమ కనబరిచేవాడని, వారుమరణించడం పార్టీకి తీరని లోటు అన్నారు.

## బంద్‌ను విజయవంతం చేయాలని బైక్ ర్యాలీ



**ప్రజాపక్షం/మణుగూరు:** బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర బీసీ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు నేడు మణుగూరు లో నిర్వహించే బంద్ లో పాల్గొని సహకరించాలని బీసీ సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు, కుల సంఘాలు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మణుగూరు పట్టణంలో బైక్ పై ర్యాలీ గా బంద్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మణుగూరు పట్టణ మండల కార్యదర్శి లు దుర్గ్యాల సుధాకర్, జక్కుల రాజబాబు, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు ఆర్. మధుసూదనరెడ్డి, బీసీ సంఘాలు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జీ సోమేశ్వరగౌడ్, బీసీ నాయకులు జి.వి, రుద్ర నాగరాజు, వలసల వెంకటరామారావు, పెనుగొండ సాంబ, బి.పద్మ , రమాదేవి, ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్షులు రాయల భిక్షం, సీపీఐ మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, ఎస్కే సర్వర్, అదెర్ల రాములు, కన్నెబోయిన ప్రసాద్, వజ్జా వెంకటేశ్వర్లు, కణితి సత్యనారాయణ, వీరబాబు,సతీష్, రంగు ఆంజనేయులు, ఎంఆర్‌పిఎస్ నాయకులు బోయిళ్ళ వెంకటేశ్వర్లు, ఇసుకల కొండయ్య, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలన ద్వారా మెరుగైన జీవితం

**ప్రజాపక్షం/పాల్వంచ :** పేదరిక నిర్మూలన ద్వారా మెరుగైన సమాజ స్థాపన జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం రాజేందర్ అన్నారు. శుక్రవారం పాల్వంచ మండలంలోని కుంటి నాగులగూడెంలో జరిగిన నాయ్య అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యాతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగం, చదువుకోవాల్సిన వయస్సులో పనులకు వెళ్లడం వాంటి ప్రధాన కారణాలు పేదరికంను సూచిస్తాయని తెలిపారు. ఆర్థిక అసమానతలు తగ్గించడం ద్వారా పేదరిక తగ్గించవచ్చని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన కోసం అందిస్తున్న సంఐేమ పథకాల గురించి వివరాలు, గ్రామాల్లో బాల్య వివాహాలు నిషేదించాలని కోరారు. పేదరిక తగ్గిచండం కోసం మహిళలు డ్రాక్వా గ్రూపుల్లో చేరడంతో స్వయం సహాయక ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యావాది తోట మల్లేశ్వరరావు, పాల్వంచ టౌన్ ఎస్ఐ జీవన్ రాజ్, పారా లీగల్ వాలంటీర్స్ బాడీషా, భిక్షమయ్య, ఎం జానకిరామ్, కే వీరభద్రం, నాగమణి, గ్రామ పెద్దలు దశరాజు, రమేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపక్షం వరుస కథనాలతో..

# జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

**ఆర్‌డిఎంఏ షాహిద్ మసూద్ ఉత్తర్వులు జారీ**



విచారణ చేస్తున్న దృశ్యం(ఫైల్)

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో నిధులు దుర్వినియోగంపై ప్రజాపక్షం దినపత్రికలో వరుస కథనాలను ప్రకటించడం జరిగింది. ఈ కథనాలతో విచారణ జరిపిన అధికారులు జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు విధుల నుంచి సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళితే వైరా మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ సొంత అకౌంట్లకు బదిలీపై ఆగస్ట్ 8, 12న ప్రజాపక్షం దినపత్రికలో తర్వాత వరుసగా కథనాలు ఇవ్వడం జరిగింది. కథనాలతో డొంక కదలడంతో అవినీతికి బయటకు వచ్చింది. దీంతో అకౌంటెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన ఐతంరాజు వెంకటేశ్వర్లు(ఏవిఆర్) సస్పెన్షన్ చేశారు. ఐతంరాజు వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తూ శుక్రవారం రాత్రి వరంగల్ ఆర్‌డిఎంఏ షాహిద్ మసూద్ ఉత్తర్వులు జారీ చేశారు. వైరా మున్సిపాలిటీలోని రూ.2కోట్ల జనరల్ ఫండ్ నిధుల్లో రూ.54లక్షలు దుర్వినియోగం చేయడంతో ఏవిఆర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. మున్సిపాలిటీలో అకౌంటెంట్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ ఏవిఆర్ నిబంధనలకు విరుద్ధంగా తన పేరుపై ఇష్టానుసారంగా సొంత అకౌంట్లకు చెక్కులు వ్రాసుకొని డబ్బులు స్వాహా చేశారు. అదేవిధంగా ముగ్గురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పేర్లపై సెల్ఫ్ చెక్కులు వ్రాశారు అనే వాదన కూడా వినిపిస్తుంది. అయితే ఇంకా పెద్ద ఎత్తున విచారణ జరగనున్నట్లు సమాచారం.


వైరా మున్సిపాలిటీలో
దారి మళ్లిన జనరల్ ఫండ్..!
-ప్రైవేటు ఖాతాలకు రూ. 80 లక్షలు బదలాయింపు
-ఖమ్మం యాక్సిస్ బ్యాంకులో నగదు డ్రా చేసిన అకౌంటెంట్
-ప్రత్యేకాధికారికి తెలియకుండానే నిధుల మళ్లింపు

సొంతంగా వ్రాసుకున్న చెక్కుల ద్వారా సుమారు రూ.54 లక్షలు నిధులను డ్రా చేశారు. అంతే కాకుండా క్యాష్‌బుక్‌లో చెక్కు నెంబర్‌తో పాటు నగదు వివ రాలను, ఏ పనికి నగదు చెల్లించిన విషయాలను పొందుపరచలేదు. కనీసం క్యాష్ బుక్ కూడా మెయింటె నెన్స్ చేయకుండా ఇష్టాను సారంగా వ్యవహరించారు. ఈ వ్యవహారంలో అప్పటి కమీషనర్ చింతా వేణుతో పటు జూనియర్ అసిస్టెంట్ ఏవిఆర్, ముగ్గురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కీలకపాత్ర పోషించారు. ముగ్గురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పేరు మీద లక్షలాది రూపాయలు డ్రా చేశారు. అతి దారుణమైన విషయం ఏమిటంటే ఒక వెహికిల్ ప్రయాణ ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయల ఖర్చు చేసినట్టు వ్రాయడం మరికొంత విచారణకు మూల కారణం అయిందని చెప్పవచ్చును. ఈ విషయమై ఇటీవల వరంగల్ ఆర్‌డిఎంఏ షాహిద్ మసూద్ మున్సిపాలిటీ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఇష్టానుసారంగా నిధులు డ్రా చేసినట్లు తేలడంతో జూనియర్ అసిస్టెంట్ ఏవిఆర్‌ను సస్పెండ్ చేస్తూ ఆర్‌డిఎంఏ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే వైరా మున్సిపాలిటీలోని అవినీతి వ్యవహారంపై సిపిఎం, సిపిఐ ఆందోళనలు నిర్వహించాయి. అయితే ఈ అవినీతి వ్యవహారంపై మరింత రచ్చ కాకుండా ప్రాథమికంగా ఏవిఆర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలుస్తుంది. అయితే మరింత లోతుగా విచారణ జరిపిన తర్వాత మరికొందరిపై వేటు పడనున్నట్లు సమాచారం.

# బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాల మద్దతు

**-నేడు విద్యా సంస్థలు బంద్**
**-వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బిసి జెఏసి సంఘాల ఆధ్వర్యంలో బంద్ ఫర్ జస్టిస్ పేరుతో నిర్వహిస్తున్న తెలంగాణ బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాల తరుపున సంపూర్ణ మద్ధతు ప్రకటిస్తున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. బంద్‌కు మద్ధతుగా నేడు విద్యా సంస్థల బంద్‌కు కూడా పిలుపునిస్తున్నాయని యాజమాన్యాలు, విద్యార్థులు సహకరించాలని వారు తెలిపారు. శుక్రవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో వామపక్ష విద్యార్థి సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మస్తాన్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సుధాకర్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు లక్ష్మ ణ్, జార్జిరెడ్డి పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు మందా సురేష్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిందని దానిని గవర్నర్, రాష్ట్రపతికి పంపిన ఆరు నెలలు గడుస్తున్నా ఆమోదించడం లేదన్నారు. 42 శాతం బిసి బిల్లు జీవోని షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. 42 శాతం బిసి రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల ఎన్నికల్లో న్యాయం జరుగుతుందని బిజెపి ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. రాష్ట్రంలో రాజకీయ లబ్ది కోసం మద్ధతు అంటూ కేంద్రంలో బిజెపి బిసి బిల్లును అడ్డుకుంటుందన్నారు. విద్యార్థి లోకం కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. బిజెపికి బిసిల పట్ల చిత్తశుద్ది ఉంటే వెంటనే బిసి బిల్లును గవర్నర్, రాష్ట్రపతి చేత ఆమోదింపచేయాలన్నారు. శనివారం జరగబోయే విద్యా సంస్థల బంద్‌కు యాజమాన్యాలు, విద్యార్థులు సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు శివ, రాజు, అజయ్, గోపి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కెజిబివిలో విద్యార్థినికి తీవ్ర గాయాలు

**-ఆలస్యంగా వెలుగులోకి..**




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రఘునాథపాలెం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి)లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి తీవ్ర గాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... కూసుమంచి మండలం ధర్మతండాకు చెందిన జర్పుల సుమన్ సునీత దంపతుల కుమార్తె జర్పుల శ్రీవల్లి రఘునాథపాలెం శివాయిగూడెం వద్ద గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబిబి)లో మొదటి సంవత్సరం చదువుతుంది. గురువారం తెల్లవారుజామున స్టడీ అవర్స్ కోసం విద్యార్థినిలను ఉపాధ్యాయులు నిద్ర లేపారు. ఈ క్రమంలో శ్రీ వల్లి మూడో అంతస్తుకు వెళ్లి భవనం పైనుంచి మొదటి అంతస్తులోని పోర్టికోలో పడినట్లు సమాచారం. వెంటనే పాఠశాల సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు విషయం తెలిపినట్లు కెజిబివి బాధ్యులు తెలిపారు. శ్రీవల్లి తలకు, నడుముకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉండగా తమ కుమార్తె కిందపడిన విషయాన్ని పాఠశాల బాధ్యులు చెప్పకుండా జ్వరం తగిలిందని చెప్పారని తెలిపారు. భవనం పై నుంచి కిందపడితే పక్కనే పోలీస్ స్టేషన్‌కు కూడా వారు సమాచారం అందించలేదని శ్రీవల్లి తండ్రి సుమన్ తెలిపారు. రక్తపు మరకలను కూడా తుడిపించారని శ్రీవల్లికి గాయాలైన సంఘటనపై పలు అనుమానాలు ఉన్నాయని దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో విద్యార్థిని తండ్రి ఫిర్యాదు చేశాడు. తీవ్ర గాయాలు కావడంతో వైద్య ఖర్చులు ఎక్కువవుతున్నాయని తమను ఆదుకోవాలని అధికారులను వేడుకున్నారు. దీనికి సంబంధించి కెజిబివి ఎస్‌వోను వివరణ కోరగా విద్యార్థిని మానసిక పరిస్థితి బాగాలేదని తోటి విద్యార్థినిలు చెబుతున్నారని ఆమె భవనం పైకి ఎందుకు వెళ్లిందో, ఎలా కిందపడిందో తెలియాల్సి ఉందన్నారు. కిందపడటం గుర్తించిన వెంటనే ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఇట్టి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు.

# సాయిరాంకు ఉత్తమ ఆసుపత్రి అవార్డు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని సాయిరాం ఆసుపత్రికి ఉత్తమ ఆసుపత్రిగా అవార్డు లభించింది. ప్రముఖ మీడియా సంస్థ హైబిజ్ టివి హైదరాబాద్ వారు నిర్వహించిన ఐదవ ఎడిషన్ హెల్త్ కేర్ అవార్డ్స్ 2025 కార్యక్రమంలో ఖమ్మం సాయిరాం ఆసుపత్రిని బెస్ట్ ఎమర్జింగ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా అవార్డుతో సత్కరిం చారు. సాయిరాం ఆసుపత్రి అత్యుత్తమ వైద్య సేవలతో పాటు క్లిష్టతరమైన వైద్య సేవలు కూడా అందించడంతో పాటు అత్యాధునీక సౌకర్యాలతో రోగులకు నాణ్యమైన సేవలు అందిస్తు న్నందుకు ఈ అవార్డును అందజేశారు. హైదరాబాద్ హెచ్ఐసిసి నోవటెల్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా సాయిరాం ఆసుపత్రి ఛైర్‌పర్సన్, డయాబెటిక్ స్పెషలిస్ట్ డాక్టర్ స్వాతి జంగాల, మేనేజింగ్ డైరెక్టర్ గోల్డ్ మెడలిస్ట్, ప్రముఖ వైద్యులు సునీల్ కుమార్ జంగాల అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి జంగాల, డాక్టర్ సునీల్‌కుమార్ జంగాల మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఖమ్మం పరిసర జిల్లాల ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. సాయిరాం ఆసుపత్రి అందిస్తున్న సేవలకు అవార్డు రావడం ఎంతో గర్వకారణమన్నారు. వైద్య బృందం కృషి, ప్రజల విశ్వాసానికి దక్కిన గుర్తింపు అన్నారు.రాబోయే రోజుల్లో అత్యాధునీక వైద్య సేవలు ప్రజలకు మరింతగా అందించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు. అన్ని రకాల వైద్య సేవలు ఒకే చోట అందిస్తూ సమగ్ర ఆరోగ్య పరిరక్షణకు సాయిరాం ఆసుపత్రి విశిష్ట గుర్తింపు పొందిందన్నారు.

# బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

**ప్రజాపక్షం/కారేపల్లి:** బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం వెంటనే జీవో జారీ చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కారేపల్లి కామేపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి భూక్య శివ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ బిసిలకు 42శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపిన బిల్లును కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టి బిజెపి ప్రభుత్వం తెలంగాణ బిసిలకు అన్యాయం చేస్తుందన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపకుండా కోర్టు చుట్టూ తిప్పడం సరైనది కాదన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదిచిన బిసి బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోద ముద్ర వెయ్యాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చి వెంటనే బిసలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఈనెల 18 తెలంగాణ రాష్ట్ర బంద్‌కు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు.

# బిసి బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని రాష్ట్ర బందులో బాగంగా సిపిఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య కార్యకర్తలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని వాణిజ్య, విద్యా సంస్థలతో పాటు అన్ని వ్యాపార రంగాల ప్రజలు బందుకు సహకరించాలని కోరారు. రాష్ట్రంలో అత్యధిక జనాభ కలిగిన బిసిలకు సరైన రిజర్వేషన్ లేక వెనుక బడి ఉన్నారని తెలిపారు. రిజర్వేషన్ అమలు జరిగితే సామాజికంగా, ఆర్థికంగా బలపడతారిని తెలిపారు. రిజర్వేషన్ అమలు జరిగితే విద్యా, వైద్యం ఉద్యోగం, ఉపాధి అవకాశాల్లో సమాన హక్కు పొందుతారని కొన్ని రాజకీయ శక్తులు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. బిసి రిజర్వేషన్ అమలు పరిచేందుకు అన్ని రాజకీయ వర్గాల ప్రజలు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బొల్లోజు వేణు, సహాయ కార్యదర్శి తాటిపూడి రమేష్ కాక వెంకటేశ్వర్లు మడకం ముత్తయ్య, అపక తిరుపతి రావు, తదితరులు పాల్గొన్నారు..

# బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం వెంటనే జీవో జారీ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం ములకలపల్లి మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిలకు 42శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపిన బిల్లును కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టి బిజెపి ప్రభుత్వం తెలంగాణ బిసిలకు అన్యాయం చేస్తుందన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపకుండా కోర్టు చుట్టూ తిప్పడం సరైనది కాదన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదిచిన బిసి బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోద ముద్ర వెయ్యాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చి వెంటనే బిసలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు వూకంటి రవికుమార్, నిమ్మల మధు, గోపగాని లక్ష్మీ నరసయ్య, బైరు ప్రసాద్, చేడే పద్మ, సోయం కృష్ణ, మంచాల సారయ్య, శనగాని వినోద్, కంపసాటి వెంకటేశ్వర్లు, అంజమ్మ, మస్తాన్, మోడె రాంబాబు, గడ్డం రాజు, బిబినేని గడ్డయ్య, తదితరులు పాల్గొన్నారు.